క్లుప్తంగా

నేడు రైతువేదికలో సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ

దోమ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేపై మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ మహేశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటు చేయనున్నామని, మండలంలోని 94 మంది ఎన్యూమరేటర్లు, 9 మంది సూపర్‌వైజర్లు, 10 మంది రిజర్వ్ ఎన్యూమరేటర్లు, ఇద్దరు రిజర్వ్ సూపర్‌వైజర్లు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

కులగణనలో లంబాడీల మాతృభాష నమోదు చేయాలి

బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్



మాట్లాడుతున్న గట్యానాయక్

పరిగి: ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనలో లంబాడీల మాతృభాష గోర్‌బోలి అని సంబంధిత కాలంలో నమోదు చేయాలని బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాలకు ప్రభుత్వ అధికారులు సర్వేకు వచ్చినప్పుడు తప్పకుండా అందరు ఎస్టీ లంబాడీ అని రాయించాలన్నారు. మాతృభాష గోర్‌బోలి చెప్పాలన్నారు. దీంతో లంబాడీ భాషకు రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చడానికి గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంతను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఎంసీ డైరెక్టర్లు

బంట్వారం: మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 5వ తేదీ నుంచి పశువుల సంత పునఃప్రారంభం అవుతుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యాదగిరి, శాకం నర్సింలు తెలిపారు. ఆదివారం బంట్వారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంత కాలం నుంచి రద్దైన పశువుల సంతను మళ్లీ ప్రారంభించనున్నట్లు చెప్పారు. మర్పల్లి పరిసర ప్రాంతంలోని ఖరీద్‌దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రతి మంగళవారం ఉదయం 6 గంటల నుంచి పశువుల సంత ప్రారంభమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకోసం కృషి

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



మహేశ్‌కుమార్‌గౌడ్‌తో మండల నాయకులు

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీకోసం పని చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను పేర్కొన్నారు. ఆదివారం నవాబుపేట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, రావుగారి వెంకట్ రెడ్డిలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు.


నర్సింలు మృతి బాధాకరం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ద నర్సింలు మృతి బాధాకరమని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన పెద్ద నర్సింలు ముదిరాజ్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే ఆదివారం బాధిత కుటుంబీకుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు తాము అండగా ఉంటామన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ. 9వేలు అందించామన్నారు. మండల అధ్యక్షుడు అంజనేయులు, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యానికి రక్ష



అమ్మకానికి కూరగాయలు



ఆకుకూరలు

- జంక్ ఫుడ్‌తో పొంచి ఉన్న ముప్పు
- వ్యాధుల నివారణకు ఆహారమే కీలకం
- తాజా కూరగాయలు శ్రేయస్కరం
- వ్యాధి నిరోధక శక్తి పెంపుదలకు దోహదం

దుద్యాల్: రోజువారి జీవనవిధానంలో ఆరోగ్యం ప్రధానం. దీని కోసం వ్యాయామం, యోగ, నడక వంటివి చేస్తుంటారు. వాటితో పాటు రోజు తీసుకునే పౌష్టికాహారం ఆరోగ్యాన్ని సమస్థాయిలో ఉంచుతుంది. దీనికోసం ప్రతిరోజు తాజా ఆకుకూరల మొదలుకొని, మొలకెత్తిన విత్తనాలు, పాలు, పండ్లు, మాంసాహారం వంటివి తీసుకోవాలి. ముఖ్యంగా బహిరంగా మార్కెట్‌లో లభించే జంక్ ఫుడ్‌తో ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని తెలుసుకోవాలి, వాటికి దూరంగా ఉండడం మంచిది. ప్రస్తుతం సీజనల్‌గా వచ్చే వ్యాధులకు దూరంగా ఉండాలంటే ప్రతీరోజు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నిల్వ చేసిన ఆహార పదార్థాలతో అనారోగ్యం

నిల్వ చేసిన ఆహార పదార్థాలు తినడం వల్ల అనారోగ్యం బారిన పడతాం. ఇలాంటి ఆహార పదార్థాలతో వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుంది. బహిరంగ మార్కెట్లో దొరికే జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండడం మంచిది. కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచినవి తినకపోవడం ఉత్తమం.

పాలు, నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి

ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి వ్యక్తి పాలు, నీళ్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. పరిశుభ్రమైన నీటిని కాచి చల్లార్చి తాగాలి. శరీరానికి సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి.

పప్పు ధాన్యాలకు ప్రాధాన్యం

రోజువారి ఆహారంలో పప్పు ధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదంపప్పు వంటివి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. 100గ్రాముల ఆకుకూరలు తినటం మంచిది. జామ, నిమ్మ, ఉసిరిలలో ఏదో ఒకటి తీసుకోవాలి. ప్రతిరోజు ఉడికించిన కోడిగుడ్డు, వారంలో ఒకసారి మాంసాహారం తినాలి. నానబెట్టిన గింజలు, అలసందలు తినటం ఆరోగ్యానికి మంచిది.

శుభ్రత అవసరం

మనిషి ఆరోగ్యానికి ఆహార పదార్థాలు ఎంత ముఖ్యమో శుభ్రత కూడా అంతే ముఖ్యం. భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఆహారం ఒకేసారి ఎక్కువగా కాకుండా కొంచెం కొంచెం ప్రతి మూడు గంటలకు తీసుకోవాలి. దీంతో ఆహారం త్వరగా జీర్ణం అవుతుంది. ఆరోగ్యంగా ఉండేందుకు తాజా కూరగాయలు వాడాలి. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. వీటిలో ఉండే సూక్ష్మ పోషక పదార్థాలు, ఫైబర్ వంటివి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. పసుపు, నారింజ రంగులో ఉండే కొన్ని రకాల పండ్లు తినడం వల్ల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి.

ఆహారపు అలవాట్లు

ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని రక్షిస్తుంది.



శనగ, పెసర మొలకలు

ప్రతిరోజు ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల మొలకెత్తిన గింజలు లేదా 60 గ్రాముల పప్పులు, 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవాలి. ఉదయం 11 గంటల సమయంలో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయలు తీసుకోవాలి. పండ్లు అందుబాటులో లేకపోతే ఒక గ్లాసు పాలు తాగాలి. మధ్యాహ్న భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు, ఆకుకూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాలు, ఒక కప్పు పాలు తీసుకోవటం మంచిది. రాత్రి సమయంలో భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా ఒకట్రెండు చపాతి లేదా పుల్కాలు కూరగాయలతో తినాలి.

పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి



పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి. ఆహారం బాగా ఉడికించి తినాలి. దాదాపుగా అన్ని విటమిన్లు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చు. అందత్వంతో పాటు పిల్లల్లో వాంతులు, విరేచనాలు, తట్టు, శ్వాసకోస సంబంధ వ్యాధులు నివారించేందుకు ఏ విటమిన్ భాగా పని చేస్తుంది. తోటకూర, మెంతి కూర, పాలకూర, క్యారెట్, కెరోటిన్ ఉన్న మునగాకు, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడా విటమిన్లు అందుతాయి.

– డాక్టర్ హేమంత్, బొంరాస్‌పేట్

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



క్రేన్‌సహాయంతో ధ్వజస్తంభం తరలింపు

పెద్దేముల్: పెద్దేముల్ మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వేద పండితుల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గోపాల క్రిష్ణ, గురాచారి కుటుంబ సభ్యులు ధ్వజ స్తంభం, విగ్రహ దాతలుగా ఉన్నారు. ఉదయం 5గంటల నుంచి ఆలయం వద్ద హోమంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, ఇందూరు, తాండూరుతో పాటు పలు గ్రామాలకు చెందిన వేద పండితులు ప్రహల్లాద్‌జ్యోషి, కల్యాణరావు, అనంతచారి, త్రుజన్ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. పెద్దేముల్‌తో పాటు గాజీపూర్, మారేపల్లి, బుద్దారం, జనగాం, గోపాల్‌పూర్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మారేపల్లిలో..

పెద్దేముల్ మండల మారేపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలమం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం తెల్లవారు జామునుంచే ఆలయం వద్ద హోమంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులచే ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. మారేపల్లి గ్రామానికి చెందిన చౌడపురం జితేందర్‌రెడ్డి ధ్వజ స్తంభ విగ్రహదాత, వారితో పాటు గ్రామంలోని పలువురు కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. మారేపల్లితో పాటు జనగాం, మంబాపూర్, పెద్దేముల్, తాండూరు, కోట్‌పల్లి, ఇందోల్, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పైలెట్ విఠల్‌రెడ్డి, తాండూరు నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేష్‌మహరాజ్, కాంగ్రెస్ జిల్లా మహిళ అధ్యక్షురాలు శోభారాణి, తాండూరు వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్‌లు జితేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రుక్మాపూర్ మాజీ సర్పంచ్ రమేష్ కుమార్, దేష్‌ముఖ్ నరేష్‌రెడ్డి, మారేపల్లితండా సర్పంచ్ పాండు తదితరులు పాల్గొన్నారు. అతిథులకు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొమ్ము గోపాల్‌రెడ్డి, పట్లోళ్ల వెంకట్‌రెడ్డి, హరిసుదన్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చౌడపురం జితేందర్‌రెడ్డితో పాటు పలువురు వారిని ఘనంగా సన్మానం చేశారు.

మెస్ చార్జీల పెంపు హర్షణీయం



మాట్లాడుతున్న వార్డెన్ వీరానందం

యాలాల: వసతి గృహ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచడం హర్షణీయమని యాలాల ఎస్సీ బాలుర వసతి గృహ వార్డెన్ వీరానందం పేర్కొన్నారు. ఆదివారం విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తరగతుల వారీగా విద్యార్థుల మెస్ చార్జీలను ప్రభుత్వం పెంచిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు వసతి గృహాల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించనున్నామన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి తమ పిల్లలు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించాలన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



తంగడపల్లిలో వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు



షాబాద్‌లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనురాగ్‌రెడ్డి

చేవెళ్ల: పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా సత్యసాయి సేవా సమితి ద్వారా ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని తంగడపల్లి మాజీ సర్పంచ్‌లు అనూషసత్తయ్య, పర్మయ్యగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కిష్టయ్య అన్నారు. మండలంలోని తంగడపల్లిలో ఆదివారం హైదరాబాద్‌లోని శివం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరానికి గ్రామంలోని ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై వైద్యసేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు సత్యసాయి సేవా సమితి సభ్యులకు సహకరించారు. గ్రామంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మల్టీ స్పెషాలిటీ వైద్యసేవలు అందించారు. దంత సమస్యలు, స్త్రీ, శిశు విభాగం, కేన్సర్, గుండె వైద్యం, చర్మ, కంటి పరీక్షలు, ఆయుర్వేద వైద్యం, మూత్ర సంబంధ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధులు, మధుమేహం, ఎముకలు, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులకు సంబంధించి వైద్యులు ఈ వైద్యశిబిరంలో పాల్గొని రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ బుగ్గారెడ్డి ఆస్పత్రి డాక్టర్లు అనురాగ్‌రెడ్డి, విజయ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 210 మంది వరకు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ నవీన్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌గౌడ్, రవీందర్, రాంచందర్, కృష్ణ, శ్రీనివాస్, నవీన్‌కుమార్, రాజేందర్, రాములు, సతీశ్, ఆస్పత్రి సిబ్బంది సురేష్, కిరణ్, ఫయాజ్, సాయి, చైతన్య ఉన్నారు.

శబరిమలకు పాదయాత్ర



అయ్యప్పస్వాములకు స్వాగతం పలుకుతున్న నర్సింహులు

తాండూరు: అయ్యప్పస్వామి మండల దీక్షాధారణ చేసిన స్వాములు ఆదివారం తాండూరు నుంచి శబరిమల కొండకు పాదయాత్రగా వెళ్లారు. తాండూరు పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం నుంచి మాలాధారణ చేసిన స్వాములు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహబూబ్‌నగర్ రోడ్డు మార్గంలో పాదయాత్రగా బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింహులు స్వాములకు స్వాగతం పలికారు.

కార్తీక మాస పూజలు



చింతకుంటలో శివలింగానికి పూజ చేస్తున్న యువతులు

ధారూరు: ధారూరు మండలంలోని చింతకుంట గ్రామంలో కార్తీక మాసం సందర్భంగా గణనాథునికి, పార్వతి, పరమేశ్వరులకు పూజారి చెన్నబసవయ్యస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి చంద్ర సమర్పించారు. కొందరు సత్యనారాయణ కథను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

షాద్‌నగర్: చిలకమర్రిలోని రాఘవేంద్ర కాటన్ కార్పొరేషన్ ఆవరణలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభిస్తునట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థులు

పరిగి: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నంబర్ 2లో 2002–03 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం రంగాపూర్ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలను చర్చించుకున్నారు. అనంతరం చిన్ననాటి గుర్తులను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో చేసిన చిలిపి చేష్టలను స్మరించుకున్నారు. 20 సంవత్సరాల తరువాత ఒకే దగ్గర చేరి ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు.

తీరనున్న ఏళ్ల కల

ముమ్మరంగా సాగుతున్న కల్వర్టు పనులు



కుదురుమల్ల–సంగాయపల్లి రోడ్డు

దుద్యాల్: గ్రామాలు ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకూ ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంది. రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడేది. దీంతో ఆ గ్రామాల ప్రజలు పడారాని పాట్లు పడ్డారు. మండలంలోని కుదురుమల్ల గ్రామం నుంచి సంగాయపల్లి, సంగాయపల్లి తండాలకు రోడ్డు సౌకర్యం అస్తవ్యస్తంగా ఉడేది. ఈ విషయంపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు. ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గంలో రోడ్డు మరమ్మతులకు, నూతన రోడ్డు నిర్మాణాలకు నిధులు విడుదల చేయడంతో కుదురుమల్ల నుంచి సంగాయిపల్లి, సంగాయిపల్లి తండాలకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో తమ గ్రామానికి రోడ్డు, కల్వర్టు మరమ్మతు పనులు నిర్వహిస్తుండడంతో ఏళ్ల కల తీరనుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కొనసాగుతున్న కల్వర్టు పనులు

ఫిర్యాదులు పరిష్కరిస్తాం



తాండూరు: ఈడీఈ శంకర్‌కు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

విద్యుత్ శాఖ ఏడీఈ శంకర్

తాండూరు: విద్యుత్ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ తాండూరు ఏడీఈ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం తాండూరు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధి నుంచి వినియోగదారులు హాజరై విద్యుత్ సమస్యలపై పలు ఫిర్యాదులు చేశారు. మొత్తం 16 ఫిర్యాదులు అందగా అందులో వ్యవసాయ పొలాల సాగునీటి కోసం ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని, మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌లను తక్షణమే మరమ్మతు చేసి బిగించాలని రైతులు ఫిర్యాదు చేశారు. పలువురు వినియోగ దారులు లో ఓల్టేజి, విద్యుత్ డీడీల తిరస్కరణ, విద్యుత్ స్తంభాలకు వేలాడే తీగలను సరిచేయాలంటూ ఫిర్యాదు చేశారు. అనంతరం ఈడీఈ శంకర్ మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలో మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్‌కు చెందిన ఏఈలు రఘువీర్‌రెడ్డి, అరవింద్, మహేష్ , వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు



దుద్యాల్: విద్యుత్ స్తంభాలకు వైర్ కనెక్షన్ ఇస్తున్న సిబ్బంది

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో విద్యుత్ స్తంభాలకు మరమ్మతు పనులను అధికారుల సమక్ష్యంలో ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇనుప స్తంభాలకు కనెక్షన్లను తొలగించి సిమెంట్ స్తంభాలకు కనెక్షన్ ఇచ్చినట్లు లైన్‌మెన్ వెంకట్రాములు తెలిపారు.

సత్వరమే పరిష్కరిస్తాం..

అనంతగిరి: విద్యుత్ వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతను బట్టి పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ డివిజన్ కార్యాలయంలో వికారాబాద్, నవాబ్‌పేట, మర్పల్లి, మోమిన్‌పేట, ధారూర్, పూడూర్ మండలాల వినియోగదారుల నుంచి విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సంజీవ్, ఏడీఏ సత్యనారాయణరెడ్డి, సంబంధిత మండలాల ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.